సాక్షి
మంచిర్యాల
మంగళవారం : 30 : మే : 2023



పెన్షనర్లకు మొండిచేయి!

నూతన వేతన ఒప్పందంలో రిటైర్డు కార్మికుల ఊసే లేకుండా పోయింది. జేజీసీసీఐ సమావేశాల్లో తమను పూర్తిగా విస్మరించారని రిటైర్డు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



కనుల పండువగా శోభాయాత్ర

బెల్లంపల్లిలో సోమవారం విఘ్నేశ్వర సహిత ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కనుల పండువగా సాగిన శోభాయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /28.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా వడగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్జీలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన బుద్దే తిరుపతి వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నామని, రెవెన్యూ రికార్డులను తమ పేరిట నమోదు చేయాలని దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం ఐబీ గ్రామానికి చెందిన తోట కార్తీక్ తాను దివ్యాంగుడినని, పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నానని, వర్షానికి ఇల్లు కూలిపోయిందని, రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరాడు.

సీఎం కప్ పోటీల్లో ప్రణయ్‌కు బంగారు పతకం



కొత్తూరి ప్రణయ్

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కొత్తూరి ప్రణయ్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో హైజంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ప్రణయ్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీపీ మంత్రి సురేఖా, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు గ్రామస్తులు అభినందించారు.

సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమేష్

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే పూర్తి చేసి నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాలలో డీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు కోర్టు కేసులతో వాయిదా పడుతూ కాలతీతం అవుతున్నాయని తెలిపారు. విద్యార్థి నిష్పత్తి ప్రకారం ప్రతీ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు తెలియాలంటే బదిలీలు, పదోన్నతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త పీఆర్సీ కోసం తక్షణమే కమిటీని నియమించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, ఉపాధ్యక్షుడు కుమార, కార్యదర్శులు జాకీర్‌హుస్సైన్, ప్రకాశ్, సీనియర్ నాయకులు కొండయ్య, శ్రీమన్నారాయణ, మండలాల బాధ్యులు శంకర్, గంగాధర్, సంతోష్, సాయిబాబు పాల్గొన్నారు

ఆశా కార్యకర్తల పరీక్ష రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆశా కార్యకర్తలకు అర్హత పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని రకాల శిక్షణలు పూర్తి చేసుకోవమే కాకుండా రికార్డులు రాయడం, పరీక్షలు చేయడం, ఆన్‌లైన్ పనులు చేస్తున్న ఆశా కార్యకర్తలకు పరీక్ష పెట్టి ఉత్తీర్ణత సాధిస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని, లేదంటే విధుల నుంచి తొలగిస్తామని చెప్పడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమ్మక్క, శోభ, ఆశా కార్యకర్తలు పుష్ప, సునీత, పద్మ, సుజాత, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేటు పోటీ!



టెక్నోలు, ఇంటర్నేషనల్ స్థాయి అంటూ..

కార్పొరేట్ స్కూళ్ల పేరులో ఈ టెక్నోలు, ఐఐటీ ఫౌండేషన్, ప్రత్యేక కరిక్యూలమ్ అంటూ ప్రచారం చేస్తూ, ఒక సంస్థను మించి మరో సంస్థ పోటీ పడి తల్లిదండ్రులను తమ వైపు తిప్పుకుంటున్నారు. సంస్థల పీఆర్వోలు, స్కూల్ సిబ్బందితో పట్టణాలు, గ్రామాల్లో ప్రచారం చేయిస్తున్నారు. గత అకాడమిక్ పూర్తి కాకముందే వచ్చే విద్యా సంవత్సరంపై దృష్టి పెట్టిన విద్యాసంస్థలు అదే పనిగా అడ్మిషన్ల వేటలో ఉన్నాయి. కొత్త స్కూళ్ల రాకతో ఇక్కడున్న పాత స్కూళ్ల యాజమాన్యాలకు పోటీ పెరుగుతోంది. సంస్థల పోటీతో విద్య పూర్తిగా వ్యాపారంగానే మారిపోతోంది. తల్లిదండ్రులకు ఎక్కడ చేర్పించాలో తెలియని గందరగోళంలో పడుతున్నారు. ఒక్కో స్కూల్‌ను మించి మరో స్కూల్ అన్నట్లుగా ప్రచారం చేస్తుండడంతో తమ పిల్లలను ఏ బడిలో చేర్పించాలో తెలియని గందరగోళంలో పడుతున్నారు.

- జిల్లాకు బడా విద్యాసంస్థల రాక
- ఏటా ఒక్కో విద్యాసంస్థ ప్రవేశం
- పోటాపోటీగా అడ్మిషన్ల కోసం వేట
- మరింత ఖరీదవుతున్న పాఠశాల విద్య

జిల్లాలో స్కూళ్ల వివరాలు

మొత్తం స్కూళ్లు	1049
ప్రైవేటు	216
ప్రభుత్వ	833
విద్యార్థులు	1,16,072 మంది

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కార్పొరేట్ స్కూల్ జిల్లా బాట పట్టింది. ఏటేటా జిల్లాలో ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. తాజాగా ఈ ఏడాది వేసవిలోనే జిల్లాలో మరో పెద్ద కార్పొరేట్ స్కూల్ ప్రవేశించింది. గతేడాది ఓ కార్పొరేట్ సంస్థ జిల్లా కేంద్రం మంచిర్యాల శివారులోనే వెలిసింది. ప్రతీ విద్యాసంవత్సరం ఆరంభానికి ముందే ప్రైవేటు సంస్థలు ప్రారంభం జరుగుతున్నాయి. ముందస్తుగా అన్ని రకాల అనుమతులు తెచ్చుకుని ఎటువంటి ఫిర్యాదులు, సమస్యలు రాకుండా వ్యవహరిస్తూ పక్కాగా తమ విద్యావ్యాపారాన్ని జిల్లాలో విస్తరిస్తున్నాయి. మధ్య తరగతి, సింగరేణి కార్మిక కుటుంబాల పిల్లలే లక్ష్యంగా ప్రతీ విద్యా సంవత్సరంలో కొత్తగా భారీ స్థాయిలో స్కూళ్ల ప్రారంభం అవుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు ఉన్నప్పటికీ ఇప్పటికీ కొంత మంది తల్లిదండ్రుల్లో ప్రైవేటుపై మోజు తో పోటీ పడి డబ్బులు పెట్టి చదువును కొంటున్నా రు. దీంతో తల్లితండ్రుల బలహీనతతో కార్పొరేట్ స్కూళ్లు తమ విద్యా వ్యాపారాన్ని పెంచుకుంటున్నాయి. చాలా చోట్ల ఇక్కడి వారినే స్టాఫ్‌గా ఎంపిక చేసి, ఐఐటీ ఫౌండేషన్ పేరుతో రూ.లక్షల్లో ఫీజులు పెంచేస్తున్నారు. జిల్లాలో రాను రాను పాఠశాల విద్య మ రింత ఖరీదైనదిగా మార్చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు అధికంగా ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గురుకులాలు, కస్తూరిబా, సోషల్ వెల్ఫేర్, మోడల్, తదితర స్కూళ్లలో నాణ్యమైన బోధన జరుగుతోంది. కొంతమంది తల్లితండ్రులు మాత్రం ప్రైవేటుకు మొగ్గు చూపుతున్నారు.


కరోనా తగ్గాక..

రెండేళ్లు కరోనా మహమ్మారి కారణంగా విద్యాసంస్థల్లో ప్రత్యక్ష బోధన సాగలేదు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలు తగ్గిపోయాయి. చాలాచోట్ల ప్రైవేటు బడ్జెట్ స్కూళ్లు మూతపడ్డాయి. కొన్ని మళ్లీ పునఃప్రారంభానికి నోచుకోలేక పోయాయి. ఆర్థికంగా చతికిల పడ్డాయి. కొన్ని బడుల్లో నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఉంది. కోవిడ్ సమయంలో ప్రైవేటు నుంచి చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు మళ్లారు. ఆ రెండేళ్లలో సర్కారీ ప్రాథమిక, ఉన్నత స్థాయి పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయి. కరోనా ప్రభావం తగ్గడం, ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్ బోధన సాగడంతో మళ్లీ ప్రైవేటు స్కూళ్ల హవా కొనసాగుతోంది. దీంతో అకాడమిక్ సంవత్సరానికి ముందే హైదరాబాద్, విజయవాడ, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో ఉండే బడా విద్యాసంస్థలు జిల్లాలోనూ ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. మొదట ప్రాథమిక స్థాయిలో మొదలు పెట్టి క్రమంగా తమ విద్యా వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల మధ్య తీవ్ర పోటీ ఏర్పడుతోంది. అడ్మిషన్లు తీసుకొచ్చేందుకు విపరీతమైన ప్రచారం చేస్తున్నారు.

ఇళ్ల పట్టా.. తప్పుల తడక

- వివరాల నమోదులో తప్పిదాలు
- పేరు, ఇంటిపేరు, బస్తీ పేరు అన్నీ తప్పులే
- సవరణకు అవకాశం లేని వైనం
- ఎడిట్ ఆప్షన్ లేక లబ్ధిదారుల్లో గందరగోళం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీలో ఇళ్ల పట్టాల కోసం కొత్తగా రిజిస్ట్రేషన్ చేస్తున్న, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి పంపిణీ చేస్తున్న ఇళ్ల పట్టాలు తప్పుల తడకగా మారాయి. ఇంటింటి సర్వేలో వివరాలు సమగ్రంగా నమోదు చేసుకున్నా ఆన్‌లైన్ చేయడంలో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. తప్పుల సవరణకు అవకాశం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగినా అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు. తప్పిదాల సవరణకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్న అధికారులకు ఎలాంటి అధికారాలు కట్టబెట్టలేదు. లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో పట్టాల పంపిణీ పూర్తయ్యాక సీసీఎల్ఏ నుంచి ఎడిట్ ఆప్షన్ ఇస్తారనే సమాధానం చెప్పి పంపిస్తున్నారు.



ఓ లబ్ధిదారుడికి పంపించిన డిమాండ్ నోటీసు

ఇళ్ల పట్టాలకు ప్రభుత్వం ఆదేశాలు

సింగరేణి లీజు భూమి, ప్రభుత్వ భూమిని ఆక్రమించి స్థిర నివాసాలు ఏర్పర్చుకున్న పుర ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం జీవోలు 76, 58, 59 వేర్వేరుగా విడుదల చేసింది. ప్రజలు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోగా, తాజాగా జూన్ 30 వరకు గడువు పొడిగించింది. మున్సిపాలిటీ వ్యాప్తంగా జీవో 76 ప్రకారం దాదాపు 7వేల మందికి, జీవోలు 58, 59 ఆధారంగా మరో 3 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే తలంపులో ఉన్నారు.

ఆన్‌లైన్ నమోదులోనే తప్పిదాలు

దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలోనే తప్పిదాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ల కొరతతో ప్రైవేట్ ఆపరేటర్లను ఆశ్రయించి లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేయించారు. త్వరితగతిన పూర్తి చేయాలనే పట్టుదలతో రేయింబవళ్లు తీరిక లేకుండా వివరాలు నమోదు చేయించడంతో అనేక రకాల తప్పులు దొర్లినట్లు తెలుస్తోంది. తప్పుల సవరణకు మార్గాలేంటో చెప్పకుండానే మరోపక్క రోజువారీగా సర్వే చేసి డిమాండ్ నోటీసులు పంపిస్తున్నారు. రుసుము చెల్లించని లబ్ధిదారులకు రోజువారీగా సిబ్బంది ఫోన్ చేసి చెల్లించాలని చెబుతున్నారే గానీ సదరు బాధితుల గోడు వినిపించుకోవడం లేదు.

కొన్ని తప్పులు..

- బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి శాంతిఖని బస్తీలో ఓ వ్యక్తికి 200 గజాల భూమి ఉండగా ఏకంగా రూ.80 వేలు ప్రభుత్వానికి రుసుము చెల్లించాలని డిమాండ్ నోటీసు పంపించారు.
- మున్సిపాలిటీలోని 65 డీప్‌బస్తీలో 180 గజాల భూమి కలిగి ఉన్న ఓ లబ్ధిదారుడికి రూ.40 వేలు రుసుము చెల్లించాలని నోటీసును అందజేశారు.
- బెల్లంపల్లి బస్తీలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి 75 గజాల భూమి ఉండగా నయా పైసా రుసు ము తీసుకోకుండా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా రూ.18 వేలు కట్టాలని నోటీసు పంపారు.
- బెల్లంపల్లి బజారు ఏరియా, టేకుల బస్తీ, పోస్టాఫీసు బస్తీలకు చెందిన పలువురికి బస్తీల పేర్లు మార్చి డిమాండ్ నోటీసులు పంపారు.
- జీవో నెంబర్ 76 ప్రకారం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడికి 100 గజాలలోపు భూమి ఉంటే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి పట్టా ఇవ్వాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా అనేకమందికి ప్రభుత్వానికి రుసుము చెల్లించాలని డిమాండ్ నోటీసులను అందజేశారు.
- 100 గజాల లోపు భూమి ఉన్న లబ్ధిదారుల్లో ఒక్కొక్కరికి ఒక్కో తీరుగా రుసుము చెల్లించాలని డిమాండ్ నోటీసులను పంపించారు. కనిష్టంగా రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.20 వేల వరకు రుసుము చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.
- అన్నదమ్ములిద్దరికి 100 గజాల లోపు సరిసమానంగా భూమి ఉండగా ఒకరికి రూ.9 వేలు, మరొకరికి రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపించారు.
- 180 గజాల వరకు భూమి కలిగి ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒక్కో రకంగా డిమాండ్ నోటీసులు అందజేశారు. పలువురికి సమానంగా భూమి ఉండగా ఒకరికి రూ.3 వేలు కట్టాలని పేర్కొనగా మరో వ్యక్తికి ఏకంగా రూ.48 వేలు చెల్లించాలని సూచించారు.
- 200 గజాలలోపు భూమి ఉన్న ఒకరికి ఏకంగా రూ.లక్ష రుసుము చెల్లించాలని నోటీసు పంపించారు.

పేర్లలోనూ..

- లబ్ధిదారుల బస్తీల పేర్లతోపాటు వ్యక్తిగత వివరాల్లోనూ అనేక తప్పులు దొర్లాయి.
- కొందరు లబ్ధిదారుల ఇంటి పేరు తప్పుగా నమోదు కాగా ఇంకొందరి లబ్ధిదారుల తండ్రి పేరు తప్పుగా పేర్కొన్నారు.
- అనేకమంది లబ్ధిదారుల బస్తీల పేర్లు తారుమారయ్యాయి. నివాసం ఉంటున్న బస్తీలకు బదులుగా వేరే బస్తీల పేర్లు పొందుపర్చారు.
- లబ్ధిదారుల ఇంటి నంబర్లలోనూ తేడాలు నమోదు అయ్యాయి.
- ఇంకొందరు లబ్ధిదారుల బస్తీల పేర్లు లేకుండా గల్లంతు చేశారు.

9న సీఎం కేసీఆర్ రాక

- సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం
- మూడు ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు ప్రారంభం
- నస్పూర్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు
- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్



కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న సుమన్, దివాకర్‌రావు

నస్పూర్: వచ్చే నెల 9న సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ కోరారు. సోమవారం ఆయన మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి నస్పూర్ పట్టణంలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ భవనం, బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాలను సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సుమారు లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.1658 కోట్లతో చేపట్టనున్న కాళేశ్వరం–చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి, మందమర్రి సమీపంలో రూ.500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఫామాయిల్ ఫ్యాక్టరీ, మంచిర్యాల–అంతర్గాం మధ్య గోదావరి నదిపై రూ.164 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి, మంచిర్యాలలో మెడికల్ కాలేజీ, హాస్పిటల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. గొల్లకుర్మలకు రెండో విడత గొర్రెలు, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ, ఈబీసీ వివిధ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించే ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు నస్పూర్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సభకు జిల్లాలోని ప్రజలు కార్యకర్తలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం పరిశీలన

సీఎం ప్రారంభించనున్న జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని, బహిరంగ నిర్వహించే స్థలాన్ని బాల్క సుమన్ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి పరిశీలించారు. నాయకులు, అధికారులకు పలు సూచనలు చేశారు.

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సుమన్, కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యేలు

నస్పూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం ఆయన సీసీసీ నస్పూర్ సింగరేణి గెస్టుహౌజ్‌లో దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, జూన్ 9న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, చైర్‌పర్సన్‌లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి 22వరకు దశాబ్ది ఉత్సవాలు, కేసీఆర్ పర్యటనను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన పురోగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. వరిధాన్యం పండించడంలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని అన్నారు. పేదల అభ్యున్నతికి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతీ మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీలో డంపింగ్ యార్డ్, శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పిస్తున్న దేశంలో ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో విధిగా పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో దశాబ్ది వేడుకలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేస్తూ తెలంగాణ దశాబ్ది వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, జిల్లా శాఖల అధికారులతో దశాబ్ది ఉత్సవాల ని ర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ల ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించాలని, అమరవీరుల స్తూపాల వద్ద ఘనంగా నివాళులు అర్పించాలని తెలిపారు. జూన్ 22 అన్ని రంగాల్లో సాధించిన ప్రగతి చాటేలా నిర్వహించాలని పేర్కొన్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో దశాబ్ది వేడుకల విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు దాసరి వేణు, శ్యామలాదేవి, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడంలో విఫలం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఎంవీ.గుణను పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

పాతమంచిర్యాల: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ.గుణను పరామర్శించారు. ఆస్పత్రిని పరిశీలించి రోగులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారని, వడదెబ్బకు గురైన రోగులను ఆరుబయటే బెడ్‌పై ఉంచి వైద్యం అందించడం అన్యాయమని అన్నారు. వృద్ధులు, గర్భిణులు వైద్యం కోసం గంటల తరబడి వేచి చూస్తున్నారని, రాత్రివేళల్లో వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో మహిళలకు, పురుషులకు కలిపి ఒకే వార్డు ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. మహిళలు, పురుషులకు వేర్వేరు వార్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆస్పత్రిలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక దుర్వాసన వస్తోందని, ఆస్పత్రి పారిశుధ్యం పనులు నిర్వహించే ఏజెన్సీ ఎమ్మెల్యే అనుచరులకు చెందినది కావడంతోనే ఆస్పత్రి పరిసరాలు, పరిశుభ్రత ఇలా ఉందని విమర్శించారు. రోగులకు మౌలిక వసతుల కల్పనలో వైద్యారోగ్య శాఖ మంత్రి పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. బీఎస్పీ జోనల్ మహిళా కన్వీనర్ మద్దెల భవానీ, నాయకులు సందీప్‌రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న రైతులు

నెన్నెల: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జోగాపూర్‌లో రైతులు సోమవారం రహదారిపై ధర్నా నిర్వహించారు. లారీల కొరత తీర్చాలని కేంద్రానికి తరలించిన ధాన్యాన్ని వేగంగా తూకం వేయించాలని ధాన్యం బస్తాలను రోడ్డుకు అడ్డంపెట్టి గంటపాటు రాస్తారోకో చేశారు. మండలంలోని ఏడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి నెల రోజులకుపైగా అవుతున్నా లారీల కొరతతో ఒక్క లారీ ధాన్యం లోడు కూడా మిల్లులకు తరలించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 లారీల ధాన్యం తూకం వేసి సంచుల్లో సిద్ధంగా ఉందని, మరో 50 లారీల ధాన్యం తూకం వేయకుండా ఉన్నాయని రైతులు మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆరోపించారు. ఇప్పటికే ధాన్యం బస్తాలకు చెదలు పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఎస్సై శ్యాంపటేల్ సంఘటన స్థలానికి చేరుకొని సెల్‌ఫోన్‌లో బెల్లంపల్లి ఆర్డీఓ శ్యామలదేవితో మాట్లాడించారు. రోజుకు రెండు లారీలు పంపిస్తామని ఆర్డీఓ రైతులకు నచ్చజెప్పడంతో శాంతించారు.

నేడు గుణాత్మక విద్య, ఫలితాలపై సమీక్ష

మంచిర్యాలఅర్బన్: వచ్చే విద్యా సంవత్సరం 2023–24లో విద్యార్థులకు మెరుగైన, గుణాత్మక విద్యను అందించడంతోపాటు పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనకు ఈ నెల 30న సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించే చర్యలపై చర్చించడం, ప్రణాళిక రూపకల్పనకు నిర్వహించే సమావేశానికి ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాల్, ప్రత్యేక అధికారులు హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి



అమ్మబాయి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుసాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టాక్రె అమ్మబాయి (67) సోమవారం ఇంటిముందు పందిరికి ఉన్న చిక్కుడు తీగను కొడవలితో కోస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ సర్వీసు వైరును కట్ చేసింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రూరల్ ఎస్సై సోనియా తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఎల్లయ్య (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కొత్త రోడ్డుకు చెందిన టెంట్ హౌస్ నిర్వాహకుడు ఎర్ర ఎల్లయ్య (53) హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఈ నెల 7న తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఎల్లయ్య తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించారు.

బుయ్యారం గ్రామానికి చెందిన విద్యార్థి..

వేమనపల్లి: పదిరోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని బుయ్యారం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని అనూష(18) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన కొండగొర్ల శంకరయ్య–శారద దంపతుల కుమార్తె అనూష హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. కడుపునొప్పి భరించలేక పదిరోజుల క్రితం పురుగుల మందు తాగగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. కడుపునొప్పి, డిగ్రీలో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నించిందని మృతురాలి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నీల్వాయి ఎస్సై సుబ్బారావు తెలిపారు.

'యాదవులకు అండగా ప్రభుత్వం'



మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

భీమారం: యాదవుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అండగా నిలుస్తోందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. మండలంలోని కాజిపల్లి గ్రామంలో సోమవారం గొర్రెల పెంపకంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ యాదవులతోపాటు కుర్మ కులస్తులకు సబ్సిడీపై గొర్రెలు అందిస్తున్నారని తెలిపారు. జూన్ 9 రెండో విడత పంపిణీ ప్రారంభించనుందని తెలిపారు. జీవాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పశుసంవర్ధక వైద్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు.

పెన్షనర్లకు మొండిచేయి!

- నూతన వేతన ఒప్పందంలో రిటైర్డ్ ఉద్యోగుల ఊసే లేని వైనం
- కలగానే కాంట్రాక్టు కార్మికుల ఫస్ట్ కేటగిరీ వేతనాలు
- తమ డిమాండ్లు పట్టించుకోలేదని రెండు వర్గాల ఆవేదన



పెన్షన్ కోసం ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేతన ఒప్పందంలో రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు మొండి చేయే ఎదురైంది. ఈ నెల 19, 20 తేదీల్లో కోల్‌కత్తాలో జేబీసీసీఐ–11 సమావేశాలు జరిగాయి. ఇందులో బొగ్గు గని కార్మికులకు సంబంధించిన జీతభత్యాలు, అలవెన్స్ తదితర అంశాలపై ఒప్పందం జరిగింది. దేశ వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో ఉన్న సుమారు మూడు లక్షల ఇరవై వేల మంది కార్మికులకు ఈ ఒప్పందంతో ప్రయోజనం చేకూరింది. అయితే దేశ వ్యాప్తంగా వీరితో పాటు రెండు లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగులు, మరో లక్ష మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి సంబంధించిన ప్రధాన డిమాండ్లు ఈ చర్చల్లో ఒప్పందానికి నోచుకోలేదు. వేతన ఒప్పందంలో తమను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

25 శాతం పెన్షన్ ఇక పెరగదా?

రిటైర్డ్ ఉద్యోగులు 25 ఏళ్లుగా తమ పెన్షన్ పెంపుదల కొరకు ఎదురుచూస్తున్నారు. 1998లో పెన్షన్ చట్టం అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక శాతం కూడా పెన్షన్ పెరగలేదు. మొదటి నుంచి రిటైర్డ్ అయ్యేనాటికి వచ్చే బేసిక్ జీతంపై 25 శాతం పెన్షన్ చెల్లిస్తువస్తున్నారు. దీంతో 8వ వేజ్‌బోర్డుకు ముందు రిటైర్డ్ అయిన వారికి మూడంకెలకు మించి పెన్షన్ రావడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ వేతన ఒప్పంద చర్చల్లో 35 శాతం పెన్షన్ పెంచాలని డిమాండ్ పెట్టినా ఒక్క శాతం పెరుగలేదని వాపోతున్నారు. ఇదిలా ఉంటే పెన్షన్ నిధి పూర్తిగా అడుగంటి పోయిందని, దీని రక్షించుకొంటేనే ఇచ్చే 25 శాతం పెన్షన్ ఐన వస్తుందని లేకుంటే అది కూడా పోయే ప్రమాదం ఉందని జాతీయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఈ నిధిని పెంచడం కోసం గత 10వ వేతన ఒప్పందంలో టన్ను బొగ్గు అమ్మకంపై రూ.5 పెన్షన్ నిధికి కంపెనీలు జమ చేయాలని ఒప్పందం చేసుకుంటే ఇప్పుడు దాన్ని రూ.15కు పెంచామని లేకుంటే ఈమాత్రం పెన్షన్ కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. పెన్షన్ నిధిలో నిధులు లేని కారణంగా పెన్షన్ శాతం పెంచడం కష్టసాధ్యంగా ఉందని ఓ జాతీయ సంఘం నేత తెలిపారు. పదవి విరమణ అనంతరం లభించే గ్రాట్యుటీ అధికారులకు 2017, జూన్ నుంచి రూ.20 లక్షలు చెల్లిసేత్ కార్మికులకు 2018 ఏప్రిల్ నుంచి అమలు చేయడం వల్ల అంతకు ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2017 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒకటో కేటగిరీ పట్టించుకోలేదు

ఈ వేతన ఒప్పంద చర్చల్లో తమ ప్రధాన డిమాండ్ ఒకటో కేటగిరీని జాతీయ సంఘాల నేతలు పట్టించుకోలేదని కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును యజమాన్యాలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైపవర్ కమిటీ వేతనాల అమలుపై ఒప్పందం చేసుకున్నామని, దీని వల్ల కాంట్రాక్ట్ కార్మికులకు చాలా మేలు జరుగుతుందని జాతీయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా ఈ చర్చల్లో తమను చిన్నచూపే చూశారని వారు వాపోతున్నారు.

మళ్లీ అన్యాయం..

ఈ వేతన ఒప్పందంలో కూడా రిటైర్డ్ కార్మికులకు అన్యాయం జరిగింది. రెక్కలు ముక్కలు చేసుకుని 40 ఏళ్లు కంపనీలో పనిచేసిన. దిగిపోయిన తరువాత వచ్చే 25 శాతం ఉన్న పెన్షన్‌తో ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉంది. మందులకు డబ్బులు చాలడం లేదు. 7వ వేజ్‌బోర్డు సమయంలో దిగిపోయిన వారికి కనీసం వెయ్యి కూడా పెన్షన్ రావడం లేదు. పెన్షన్ నిధిని పెంచి రిటైర్డ్ ఉద్యోగులకు 35 శాతం పెన్షన్ పెంచాలి.

– పెద్దపల్లి కోటిలింగం, రిటైర్డ్ ఉద్యోగి

జిల్లావాసికి ఎన్టీఆర్ అవార్డు



మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బాపు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని మాదారం టౌన్‌షిప్‌కు చెందిన సినీ గేయరచయిత తైదల బాపు ఎన్టీఆర్ లెజండరీ అవార్డు అందుకున్నారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఎఫ్‌టీపీసీ ఇండియా, తెలుగు సినిమా వేదిక నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

వేజ్‌బోర్డ్ ఒప్పందం అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజ్‌గోపాల్

మందమర్రిరూరల్(చెన్నూర్): వేజ్‌బోర్డ్ ఒప్పందం అమలుకానిపక్షంలో బొగ్గుగని కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజ్‌గోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలతో జరిగిన ఒప్పందం కంటే బొగ్గుగని కార్మికుల వేజ్‌బోర్డ్ ఒప్పందం మెరుగైందన్నారు. సమావేశంలో నాయకులు మేడి రాజమల్లు, వెంకటస్వామి, రాజేందర్, సంజీవ్, ఆరీఫ్, శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు



మాట్లాడుతున్న సమ్మయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు రానున్నాయని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డులో హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించేలా ఒప్పందం జరిగిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల కోసం తమ యూనియన్ మొదటి నుంచి పోరాటాలు చేస్తుందని, ఫలితంగా నేడు బ్యాంకుల ద్వారా వేతనాలు, సీఎంపీఎఫ్ చీటీలు తదితర హక్కులు, సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. జూన్ 4న కొత్తగూడెంలో జరిగే మహాగర్జన కార్యక్రమానికి అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మండల కార్యదర్శి డి.రవీందర్, యూనియన్ బ్రాంచ్ సహ కార్యదర్శి గునిగంటి నరసింహారావు, నాయకులు రాజు, ప్రభాకర్, సమ్మయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



దుస్తులు అందిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్: వేసవి క్రీడా శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు సింగరేణి డైరెక్టర్(పర్సనల్) యన్ బలరాం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో కొద్ది రోజులుగా వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ ముగింపు కార్యక్రమానికి డైరెక్టర్ బలరాం హాజరై దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం గోపాల్ సింగ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందం సాధించాం

- సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): 11వ వేజ్‌బోర్డులో బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధించామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే 7 గనిపై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. బొగ్గు గని కార్మికుల వేతన ఒప్పందం కోసం తమ సంఘం చేసిన పోరాటం ఫలితంగానే నేడు వేతనాలు పెరిగాయన్నారు. 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్స్ 25 శాతం అలవెన్సుల పెంపు వల్ల కార్మికుల జీతాలు మెరుగ్గా పెరుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్మికులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని, 2011లో ఆర్‌ఎల్‌సి సమక్షంలో చేసుకున్న ఒప్పందాలను సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు కోసం తమ సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, ఉపాధ్యక్షుడు గొల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ శ్రీనివాస్, బోడకుంట శంకర్, గంగాధర చారి, అశోక్, పిట్ సెక్రెటరీ శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకపై డైరెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో జూన్ 2, 5 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ సంబరాలపై సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్, పా) బలరాం ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ సాధించిన ప్రగతిని తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏరియా జీఎం మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులపై నిఘా



అంతర్రాష్ట్ర వంతెనపై తనిఖీలు చేపట్టిన ఏసీపీ నరేందర్

కోటపల్లి: మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులపై నిఘా పటిష్టం చేసినట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు. సోమవారం రాపన్‌పల్లి వద్ద ప్రాణహిత నది అంతర్రాష్ట్ర వంతెనపై వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాణహిత మీదుగా ప్రయాణించే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోపాటు అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. వాహనదారులు తప్పనిసరిగా పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ విద్యాసాగర్, ఎస్సైలు వెంకట్, సుబ్బారావు, పోలీసులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య

చింతలమానెపల్లి: తండ్రి మందలించాడని మనస్థాపంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన కరణ్ బిశ్వాస్(17) కొంతకాలంగా చదువు మానేసి ఖాళీగా ఉంటున్నాడు. తండ్రి గౌర్ బిశ్వాస్ చదువుకోవాలని కుమారుడిని మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన ఒప్పందమని మోసం చేస్తున్నారు

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేజ్‌బోర్డులో మెరుగైన వేతన ఒప్పందం చేశామని మూడు జాతీయ సంఘాల నేతలు కార్మికులను మోసం చేస్తున్నారని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చర్చల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ కోలిండియా యాజమాన్యంతో గట్టిగా కొట్లాడలేదన్నారు. పదో వేతన ఒప్పందం కంటే ఈసారి ఎలా మెరుగ్గా సాధించారో ఆ సంఘాల నేతలు కార్మికులకు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. సింగరేణిలో మెడికల్ బోర్డు డిప్యూటేషన్ల అవినీతిపై ఏఐటీయూసీ నేతలు ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షుడు జే.నారాయణ, కేంద్ర ఉపాధ్యక్షులు వి.అనిల్‌రెడ్డి, తిప్పారపు సారయ్య, నాయకులు గొల్ల సత్తన్న, కొమురయ్య, సందీప్, అశోక్ తన్వీర్, కిరణ్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'గిరి'పల్లెలకు మిషన్ భగీరథ నీరు



గోండుగూడలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీళ్లు



గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్

- కదిలిన అధికారులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గూడేలు, తండాల్లో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన 'దాహం తీర్చని భగీరథ' కథనానికి అధికారులు స్పందించారు. ఉదయం 8 గంటల నుంచే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు. సర్పంచ్ జాదవ్ జిజాబాయి ప్రేమ్ సింగ్ గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తండా, కొలంగూడ, గోండుగుడాలకు సరిపడా నీటిని సరఫరా చేశారు. సుంగాపూర్ సమీపంలో ఉన్న వాగుపై నీటి నిల్వ కోసం చిన్న ప్రాజెక్టు మంజూరు చేయాలని ఆమె అధికారులను కోరారు. 'సాక్షి'లో వచ్చిన కథనంతో దాహార్తి తీర్చడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి కొరత తీర్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: 'దాహం తీర్చని భగీరథ' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయమే నాగాపూర్ గ్రామాన్ని సందర్శించి బావిలో ఉన్న నీటిని పరిశీలించారు. బోరు ద్వారా నీటిని మిషన్ భగీరథ ట్యాంకులో నింపారు. దీంతో గ్రామస్తులకు నీరు అందనుంది. గతంలో నీటిని ఓపెన్ బావిలో నింపడం వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. మిషన్ భగీరథ ట్యాంకులో నీటిని నింపడంతో గ్రామంలో నీటి కొరత తీరనుంది. గ్రామంలో నీటికొరత ఉండనివ్వమని ఎంపీవో జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో కోళ్ల సంరక్షణకు చర్యలు



ఫాంలో బాయిలర్ కోళ్లు..

దండేపల్లి(మంచిర్యాల): వేసవిలో మండుతున్న ఎండలకు వేడిని తట్టుకోలేక పశువులు, కోళ్లు విలవిలలాడుతున్నాయి. బాయిలర్, లేయర్ కోళ్లు సైతం ఎండ వేడిని తట్టుకోలేక పోతున్నాయి. వేసవిలో కోళ్ల పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారి ధన్‌రాజ్ పౌల్ట్రీ రైతులకు పలు సూచనలు చేశారు.

- కోళ్లఫాం షెడ్డుపై తుంగ, లేదా వరిగడ్డి కప్పాలి. చుట్టూ గోనెసంచులతో పరదలు కట్టి నీటితో తడుపుతూ ఉండాలి. ఉష్ణోగ్రతలను బట్టి ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే బాయిలర్ కోళ్లలో బరువు పెరగకపోవడం, లేయర్ కోళ్లలో గుడ్ల ఉత్పతి తగ్గడం జరుగుతుంది. ప్రతికూల పరిస్థితులతో కొన్ని సందర్భాల్లో చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.
- కోళ్ల షెడ్డులో రెండు ఇంచుల మందంతో ఉనుక, లేదా లిట్టర్‌ను ఉంచాలి. రోజుకు రెండు మూడు సార్లు లిట్టర్‌ను తిరగేయాలి. కోళ్లు తిరిగేందుకు షెడ్డులో సరైన స్థలం ఉండాలి. గుమిగూడకుండా విడివిడిగా ఉండేలా చూడాలి.
- కోళ్లకు ఉదయం సాయంత్రం దాణా అందించాలి. ఎండ వేడిమితో దాణ తీసుకోవడం తగ్గుతుంది. బలవర్ధకమైన దాణా అందించాలి. అందులో 20 నుంచి 30 శాతం అధికంగా ఖనిజ లవణాలు ఉండాలి. ఒక టన్ను దాణాలో విటమిన్ సీ–200 నుంచి 500 గ్రాములు కలపాలి. విటమిన్–ఈ, సెలినియం మిశ్రమాన్ని టన్నుకు 200 గ్రాముల చొప్పున కలపాలి. కోళ్లు నోటి ద్వారా శ్వాస తీసుకోవడంతో శరీరంలో బైకార్బనేట్ శాతం పడిపోతుంది. కాబట్టి టన్ను దాణాలో కిలో సోడియం కార్బనేట్‌ను కలిపి అందించాలి.
- వేసవిలో చల్లని తాగునీటిని అందించాలి. నీళ్లు వేడికాకుండా ట్యాంకర్లకు గన్నీ సంచులను కప్పి నీటితో తడపాలి. నీళ్లలో ఆక్వా క్లోర్‌ను కలిపితే వ్యాధులను నివారించవచ్చు. ఎలక్ట్రోలైట్స్‌ను మోతాదుకు తగ్గకుండా, లీటరు నీటిలో రెండు గ్రాముల ఎలక్ట్రాల్ కలపాలి.

బర్త్‌డేకు వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి



రవితేజ (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్నేహితుని పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై తైసినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గర్‌కు చెందిన నల్లూరి అర్జయ్య, సుజాత దంపతుల పెద్ద కుమారుడు రవితేజ(21) స్థానిక శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి రామకృష్ణాపూర్‌లో ఉంటున్న మరో స్నేహితుని పుట్టినరోజు వేడుకలకు వెళ్లాడు. వేడుకల అనంతరం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా జిల్లా కేంద్రంలోని లక్ష్మీటాకీస్ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న సర్కిల్‌కు ఢీకొని కిందపడిపోయాడు. మరో బైక్‌పై వస్తున్న అతని స్నేహితులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి అర్జయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

నిరుపేదల ఆరోగ్య ప్రదాత కేసీఆర్

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్




సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న విప్ సుమన్

చెన్నూర్: నిరుపేదలకు ఆరోగ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసి ఆరోగ్య ప్రదాతగా సీఎం కేసీఆర్ నిలిచారని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గంలోని 104 మందికి రూ.43.87 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు అంబరాన్ని అంటాలి

చెన్నూర్ నియోజకవర్గంలో దశాబ్ది ఉత్సవాలు అంబరాన్ని అంటేలా నిర్వహించాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఐదు మండలాల దశాబ్ది ఉత్సవాల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వేడుకల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా చూడాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆదిలాబాద్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన కుమ్రం మోతీరాం స్వయం ఉపాధి కోసం బొలెరో వాహనం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం శ్యాంనాయక్ తండాకు చెందిన ఆడే సంతోశ్ కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు నీటి వసతులు కల్పించాలని, పెంబి మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భూమి పట్టా మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph : 9848571888

[H-793432]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462